క్లుప్తంగా

వృద్ధుల సంరక్షణపై శ్రద్ధ వహించాలి

ఏలూరు (టూటౌన్): వృద్ధుల సంరక్షణ పట్ల శ్రద్ధ వహించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. స్థానిక పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. వసతి గృహంలో వృద్ధులకు అందిస్తున్న సౌకర్యాలు, వసతులపై ఆరా తీశారు. వసతి గృహాన్ని పరిశీలించి మరింత పరిశుభ్రత పాటించాలని యాజమాన్యానికి సూచించారు. మంచి పౌష్టికాహారంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే వృద్ధులు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. వసతి గృహంలోని సభ్యులకు న్యాయ సహాయం అవసరమైతే జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా అందిస్తుందని రత్నప్రసాద్ తెలిపారు.

వ్యక్తిని రక్షించిన రైల్వే పోలీస్



కోటేశ్వరరావును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న రైల్వే పోలీస్


ఏలూరు టౌన్: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటానన్న వ్యక్తిని రైల్వే పోలీసులు రక్షించారు. ఏలూరు చెంచుకాలనీకి చెందిన కుసునూరి కోటేశ్వరరావు తాను చేసిన రూ.20 లక్షల అప్పు తీర్చలేక రైలుబండి కిందపడి ఆత్మహత్య చేసుకుంటానని చెల్లి లక్ష్మీశివపార్వతికి ఫోన్‌చేసి చెప్పాడు. ఆమె వెంటనే ఏలూరు పెద్దరైల్వే స్టేషన్‌కు ఉదయం 11.40 గంటలకు వెళ్లి రైల్వే ఎస్సై డి.నరసింహారావును సంప్రదించింది. వెంటనే ఎస్సై గ్యాంగ్‌మెన్, కీమెన్‌లకు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. విజయవాడ రైల్వే ఐటీ సిబ్బంది లోకేషన్ చెప్పటంతో రైల్వే ఎస్సై నరసింహారావు, కానిస్టేబుల్ విజయ్‌చంద్ర ఏలూరు పత్తేబాదలో కోటేశ్వరరావును పట్టుకున్నారు. అతడికి కౌన్సిలింగ్ ఇవ్వటంతోపాటు, ఏలూరు రూరల్ పోలీసుల సమక్షంలోనే బాధితుడ్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



జంబో షెడ్డు వద్ద కొఠారు అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటు వేయాలని దెందులూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం సోమవారం ఏలూరు రూరల్ మండలం కోమటిలంక, పెదయాగనమిల్లి, కలకుర్రు, శ్రీపర్రులో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాలతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనస్సుల్లో కొలువయ్యారని అన్నారు. టీడీపీ, జనసేన నాయకులు అధికారమే పరమావధిగా భావించి కూటమిగా ఏర్పడ్డారన్నారు. ఈ ఎన్నికల్లో వారికి సరైన గుణపాఠం ప్రజలే చెబుతారని అన్నారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ మండల సరస్వతి, సీనియర్ నాయకుడు పీవీరావు, వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు. జాలిపూడిలో పార్టీ గ్రామ అధ్యక్షుడు మధ్యాహ్నపు వాసు, ఎంపీటీసీల కాకర్ల తంబి, కోడిచుక్కల నాగేశు, కార్యకర్తలు నాయకులు కొఠారు అబ్బయ్యచౌదరిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు.



ఏలూరులో సెంట్రల్ లైటింగ్

- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.447 కోట్లతో సంక్షేమం
- 29,592 మందికి ఇళ్ల స్థల పట్టాలు
- మెడికల్ కాలేజీ ఏర్పాటు
- తమ్మిలేరు ముంపునకు పరిష్కారం

కృష్ణానది నుంచి వచ్చే ఏలూరు కాలువ, గోదావరి నుంచి వచ్చే ఏలూరు కాలువ, తమ్మిలేరు. ఇవి మూడూ పాలగూడెం (మల్కాపురం) వద్ద కొల్లేరులో కలుస్తాయి. ఏలూరు పట్టణం చుట్టూ ఏరులు ప్రవహిస్తుండటంతో 'ఏరులూరు'గా ప్రజలు పిలుస్తుండేవారు. కాలక్రమేణా 'ఏలూరు'గా వాడుకులోకి వచ్చింది. ఇక వేంగి రాజుల పాలనతో పాటు సాంస్కృతిక, సాహిత్య విశిష్టత నేపథ్యంలో హేలాపురిగా పిలుస్తుండేవారు.

– ఏలూరు టౌన్



ఫైర్ స్టేషన్ సెంటర్ వ్యూ

ఏరులూరు.. ఏలూరు

గాంధీజీ నడయాడిన 'ఏలూరు'

విజయవాడ నుంచి గాంధీజీ భార్య కస్తూరిబా తో కలిసి తిలక్ స్వరాజ్య నిధి వసూలుకు రాజ మండ్రి వచ్చారు. 1921 ఏప్రిల్ 3న ఏలూరులో అడుగుపెట్టారు. మాగంటి అన్నపూర్ణాదేవి కోరిక మేరకు పవరుపేట రైల్వే స్టేషన్‌లో రైలు దిగారు. స్టేషన్ ప్రాంతంలో బోసుబొమ్మ సెంటరులో ప్రజలనుద్దేశించి మాట్లాడారని సమరయోధులు చెబుతారు. నాడు ఏలూరు ప్రజలు గాంధీజీని బ్యాండ్ మేళం, సన్నాయి, భజనలతో రెండు గుర్రపు బగ్గీలపై ఏలూరు పురవీధుల్లో ఊరేగించారు. టౌన్ హాలులో 10 వేల మంది మహిళలతో నిర్వహించిన సభలో గాంధీజీ మాట్లాడారు. సత్తిరాజు వెంకటరత్నమ్మ, స్త్రీ సమాజ భవనానికి శంకుస్థాపన చేశారు. గాంధీజీ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు. మొక్కలు నాటారు.

చారిత్రక నేపథ్యం

తూర్పు చాళుక్యులు వేంగి రాజధానిగా 1200 వరకు తీరాంధ్ర ప్రాంతాన్ని పరిపాలించినపుడు ఏలూరు పట్టణం వేంగి రాజ్యంలో భాగంగా ఉంది. అనంతరం కళింగ రాజ్యం, గజపతుల పరిపాలనలోకొచ్చింది. 1515లో శ్రీ కృష్ణదేవరాయలు గజపతుల నుంచి దీనిని చేజిక్కించుకున్నారు. ఆ తరువాత గోల్కొండ నవాబు మహమ్మద్ కులీ కుతుబ్ షా వశమైంది. బ్రిటిష్ వారి కాలంలో ఉత్తర సర్కారు ప్రాంతాలను జిల్లాలుగా విభజించినప్పుడు ఏలూరును, మచిలీపట్నం జిల్లాలో చేర్చారు. తరువాత 1859లో గోదావరి జిల్లాలో భాగమైంది. తరువాత కృష్ణా జిల్లాకు కేంద్రంగా ఉంది. 1925లో పశ్చిమ గోదావరి జిల్లాలను ఏర్పరచినపుడు ఏలూరు జిల్లా కేంద్రమైంది.

- ఏలూరు 1866లో పట్టణంగా గుర్తించారు. 2005 ఏప్రిల్‌లో ఏలూరు మున్సిపాలిటీని ఏపీ ప్రభుత్వం నగరపాలక సంస్థగా వర్గోన్నతి చేసింది. ఏలూరు కార్పొరేషన్‌కు ఆనుకుని ఉన్న గ్రామాలను ఏలూరులో విలీనం చేశారు. నగర జనాభా 3.50 లక్షలకు చేరింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు ఏలూరు ప్రధాన కేంద్రంగా ఉండేది. 2022 జిల్లాల పునర్వ్యవస్థీకరణ తరువాత ఏలూరు లోక్‌సభకు కేంద్రంగా మారింది.

స్వరూపం :

ఏలూరు నగరానికి ఒకవైపు పల్లపు ప్రాంతాలు కొల్లేరు, కైకలూరు. మరో వైపు మెరక ప్రాంతాలు చింతలపూడి, జంగారెడ్డిగూడెం ఉన్నా యి. మెరక ప్రాంతమైన చింతలపూడి వైపు నుంచి వచ్చే తమ్మిలేరు వాగు ఏలూరి చివర అశోక్ నగర్ వద్ద రెండుగా చీలుతుంది. ఎడమవైపు చీలిన వాగు తంగెళ్లమూడి మీదుగా ప్రవహిస్తూ నగరానికి ఒక వైపు సరిహద్దుగా ఉంది. రెండో చీలిక ఆశోక్ నగర్, అమీనా పేట మీదుగా ప్ర వహిస్తూ బస్‌స్టాండు, సీఆర్‌రెడ్డి కాలేజీ పక్కగా ప్రవహిస్తూ నగరానికి వేరే సరిహద్దు ఉంది. ఈ రెండు చీలికల మధ్య డెల్టాలా ఏలూరు ఉంది. ఈ నేపథ్యంలో నాగిరెడ్డి గూడెం ప్రాజెక్ట్ కట్టక ముందు ఏలూరు ముంపునకు గురయ్యేది.

తమ్మిలేరు రిటైనింగ్‌వాల్ నిర్మాణం

ఏలూరు ప్రజలకు దుఃఖదాయినిగా మారిన తమ్మిలేరు వరద ముంపునకు ఎమ్మెల్యే ఆళ్ల నాని నేతృత్వంలో శాశ్వత పరిష్కారం చూపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.80 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో 6.5 కిలోమీటర్ల మేర తమ్మిలేరు ఏటిగట్టుకు రిటైనింగ్‌వాల్ నిర్మించారు.



ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు

ఏలూరు జిల్లావాసుల చిరకాల కోరిన ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటైంది. 2019లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేశారు. 2023 సెప్టెంబర్ 2న తరగతులు ప్రారంభించారు. రూ.525 కోట్ల వ్యయంతో ఏలూరులో మెడికల్ కళాశాల నిర్మించారు. బోధనాసుపత్రి, వైద్య విద్యార్థులకు హాస్టల్స్ భవనాలు, ప్రొఫెసర్స్, నర్సింగ్ స్టాఫ్‌కు క్వార్టర్స్ నిర్మిస్తున్నారు.

నియోజకవర్గం భౌగోళిక విస్తీర్ణం :

17, 147 హెక్టార్లు (12.1 కిలో మీటర్లు)

ఏలూరు పశ్చిమ వైపు : పెదవేగి, దెందులూరు, పెదపాడు, కొల్లేరు సరస్సు

తూర్పు : దెందులూరు, పడమర పెదపాడు

ఉత్తరం : పెదవేగి

దక్షిణం : కొల్లేరు సరస్సు

సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలు

పథకాలు	లబ్ధిదారులు	సొమ్ము (రూ.కోట్లలో)
వైఎస్సార్ ఆసరా	32,672	84,02,58,231
అమ్మ ఒడి	23,703	64,21,20,000
జగనన్న చేదోడు	2072	3,91,10,000
పంటల బీమా	1122	1,53,27,528
ఇన్‌పుట్ సబ్సిడీ	1320	1,15,44, 164
కాపునేస్తం	1824	43,94,15,000
సామాజిక పింఛన్లు	29,534	8,93,31,500
రైతుభరోసా	9,031	32,44,66,500
సున్నా వడ్డీ పంటరుణాలు	1810	52,72,396
సున్నా వడ్డీ (డ్వాక్రా)	35,620	9,79,40,454
జగనన్న తోడు	1011	13,52,90,000
వాహనమిత్ర	1993	5,81,00,000
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	1879	1,84,44,287
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	5101	18,88,32,412
వైఎస్సార్ బీమా	482	7,19,84,000
వైఎస్సార్ చేయూత	13,944	93,19,06,300
అర్చకులు	12	7,20,000
ఈబీసీ నేస్తం	879	4,54,20,000
జగనన్న వసతి దీవెన	8803	10,49,22,490
జగనన్న విద్యాదీవెన	14,811	40,11,93,896
కళ్యాణమస్తు	152	82,50,000
లానేస్తం	26	19,20,000
మత్స్యకారభరోసా	37	5,00,000
నేతన్ననేస్తం	38	9,12, 000
క్రిస్టియన్ పాస్టర్స్	30	18,00,000
మొత్తం	1,87,754	రూ.447,49,81,158

29,592 మందికి ఇళ్ల పట్టాలు

ఏలూరు నియోజకవర్గంలో 539 ఎకరాలను సేకరించి 29,592 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. పోణంగి, చొదిమెళ్ల, కొమడవోలులో జగనన్న ఇళ్ల కాలనీలు ఏర్పాటు చేశారు. 16 వేల ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోంది.

అమృత్ 2.0 నిధులు

ఏలూరు వన్‌టౌన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, ఏడు విలీన గ్రామాలకు గోదావరి జలాలు ఇంటింటికీ సరఫరా నిమిత్తం అమృత్ 2.0 పథకంలో ఏలూరు నియోజకవర్గానికి రూ.361.55 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఏలూరు నగరంలో 14 సచివాలయ భవనాలు నిర్మించారు. 8 రైతు భరోసా కేంద్రాలు, 5 వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, 5 యూపీహెచ్‌సీలు ప్రారంభించారు.

అభివృద్ధి ఇలా..

ఏలూరులో నగరంలో 795 అభివృద్ధి పనులు (సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, బోర్లు, పైపులైన్లు) చేపట్టారు. ఇందుకు రూ.150 కోట్లు ఖర్చు చేశారు. ఏలూరు నగరంలో రూ.33.19 కోట్లతో 36 ప్రధాన రహదారుల్లో రోడ్లు విస్తరించారు. సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి నగరాన్ని సుందరీకరించారు.

- రూ.8.17 కోట్లతో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశానవాటికల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. ఏలూరు నియోజకవర్గంలో ఆయా సామాజిక వర్గాలకు సంబంధించి 19 కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి స్థలాలు ఇవ్వడంతోపాటు రూ.2 కోట్లు భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ఆళ్ల నాని మంజూరు చేశారు.

సంక్షేమం ఇలా

లబ్ధి పొందిన కుటుంబాలు **90,249**

తెల్లరేషన్ కార్డులు **76,076**

ఏలూరు నగరంలో డివిజన్లు **50**

ఏలూరులో వార్డు సచివాలయాలు **79**

నగరంలో వలంటీర్లు **1472**



తమ్మిలేరు రిటైనింగ్‌వాల్

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు



ఏలూరు నియోజకవర్గం ప్రజలకు సంక్షేమంతోపాటు నగరాన్ని అభివృద్ధి చేయడమే మా ప్రధాన లక్ష్యం. ఏలూరులో ఇప్పటికే లక్షా 85 వేల మంది లబ్ధిదారులకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో రూ.447 కోట్లు జమైంది. 30 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశాం. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభించాం. తమ్మిలేరు ఏటిగట్టు రిటైనింగ్‌వాల్ నిర్మించాం. విలీన గ్రామాలకు గోదావరి జలాల తరలింపు, ఇంటింటికి తాగునీరు, వన్‌టౌన్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఇలా అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పనిచేశాం. భవిష్యత్‌లో నగరాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు రెండంతల సంక్షేమాన్ని అందిస్తాం.

– ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని), ఎమ్మెల్యే, ఏలూరు

రాజకీయ నేపథ్యం

ఏలూరు నియోజకవర్గం 1955వ సంవత్సరం నుంచి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆరుసార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ, రెండు సార్లు స్వతంత్ర, ఒకసారి సీపీఐ అభ్యర్థి గెలుపొందారు. కాగా 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బడేటి బుజ్జి 82,483 ఓట్లతో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని)పై 24,603 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఈ ఎన్నికల్లో నానికి 57,880 ఓట్లు లభించాయి. 2019వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఆళ్ల నాని టీడీపీ అభ్యర్థి బడేటి కోట రామారావు (బుజ్జి)పై 4,072 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఆళ్ల నాని 72,247 ఓట్లు సాధించగా బడేటి బుజ్జి 68,175 ఓట్లకు పరిమితయ్యారు. అలాగే జనసేన అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడుకు 16,681 ఓట్లు రాగా నోటాకు 1524 వచ్చాయి.

ఓటర్ల వివరాలు

జనాభా 2,83,630

ఓటర్లు 2,23,438

పురుషులు 1,06,653

మహిళలు 1,16,774

థర్డ్ జెండర్ 41



ఏలూరులో ఎన్నికల ప్రచార జోరు



ఏలూరు టౌన్: 36వ డివిజన్‌లో ప్రచారంలో పార్టీ నాయకులు మజ్జి కాంతారావు



ఏలూరు టూ టౌన్: 21వ డివిజన్ శాంతి నగర్‌లో ప్రచారం చేస్తున్న కార్యకర్తలు

ఏలూరు టౌన్: ఏలూరులో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం జోరు పెంచారు. ప్రతి గడపకూ వెళ్లి వైఎస్సార్ సీపీ హయాంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు చేకూరిన మేలును వివరించారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి సీఎం వైఎస్ జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. 36వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్, పార్టీ నాయకులు మజ్జి కాంతారావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు యుగంధరప్రసాద్, నాయకులు ఉన్నారు.

- 1వ డివిజన్‌లో కార్పొరేటర్ ఆరేపల్లి రాధిక, పార్టీ నాయకులు సత్తిబాబు ఆధ్వర్యంలో డివిజన్‌లో జోరుగా ప్రచారం సాగుతుంది. ప్రచారంలో పార్టీ క్లస్టర్–3 అధ్యక్షుడు మంచెం మైబాబు, నాయకులు సిరిగిబత్తిన రాము, పునూరి భాస్కరరావు, నాగేశ్వరరావు, స్వరూప, చెల్లూరి అప్పన్న, ఎం.శ్రీను, పల్లి శ్రీనివాస్, పీ. వాసు తదితరులు ఉన్నారు.
- 9వ డివిజన్‌లో కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్ ఆధ్వర్యంలో గడపడపలోనూ ప్రచారం చేశారు. సేవాదళ్ నగర అధ్యక్షులు యల్లాపు మోజెస్, పార్టీ నాయకులు లంకలపల్లి గణేష్ తదితరులు ఉన్నారు.
- 8వ డివిజన్ కార్పొరేటర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కోఆప్షన్ సభ్యులు గుడివాడ రామచంద్రకిషోర్, నాయకులు పాలడుగు మురళీశ్యామ్, సీతారామయ్య, రంభ రాజ, బుజ్జి సత్యనారాయణ ఉన్నారు.
- 41వ డివిజన్ కార్పొరేటర్ ఈదుపల్లి కళ్యాణి, పార్టీ నాయకులు ఈదుపల్లి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో అదివారపుపేటలో ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ లీగల్‌సెల్ ప్రత్తిపాటి తంబి, కోనా ఉమా, బొండేటి ప్రసాద్, రత్తయ్య, సత్యనారాయణ, సుబ్బారావు, దుర్గారావు ఉన్నారు.

21వ డివిజన్ శాంతి నగర్‌లో..

ఏలూరు (టూటౌన్) : వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కారుమూరి సునీల్ కుమార్‌ను, ఆళ్ల నానిలను గెలిపించాలని కోరుతూ స్థానిక 21వ డివిజన్ శాంతి నగర్‌లో మంగళవారం వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. విట్టాల చంద్ర శేఖర్, సుంకర శశి పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్ సీపీదే అధికారం



ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారం చేపట్టటం ఖాయమనీ ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో పరసా శశిధర్ నాయకత్వంలో 49వ డివిజన్‌కు చెందిన 50 మంది టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే నాని కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నాని మాట్లాడుతూ సీఎం జగనన్నతోనే పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు జరుగుతుందని, చంద్రబాబు కూటమి మోసపు మాటలు నమ్మవద్దని ప్రజలను కోరారు. అమలు కాని హామీలు గుప్పించటం మినహా చంద్రబాబు చేసేది ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో చౌటపల్లి సుధాకర్, చౌటపల్లి శివ, కఠారి నవీన్, కొత్తపల్లి వెంకటరావు, పరిసిపోగు జాన్, దుర్గారావు, మనోజ్‌కుమార్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

- ఏలూరు 4వ డివిజన్‌కు చెందిన జనసేన సీనియర్ నాయకులు రాగోలు రంగబాబు ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే నాని పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావటమే మన ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, నాయకులు పెరికే వరప్రసాదరావు తదితరులు ఉన్నారు.

క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమమే లక్ష్యం



ఎమ్మెల్యే నానిని కలిసిన పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు

రాష్ట్రంలో క్రిస్టియన్ మైనార్టీలు, ముస్లిం మైనార్టీలు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేసిందని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏలూరులోని గుడ్ సమారిటన్ పాస్టర్స్ ఫెలోషిప్ వ్యవస్థాపకులు కోలా కిరణ్, అధ్యక్షులు జె.రాజ్‌కుమార్, కార్యదర్శి బి.జోసఫ్ డేనియల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితో క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలకు ప్రమాదం పొంచి ఉందని, రాబోయే ఎన్నికల్లో క్రైస్తవులు వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఉంటారని తెలిపారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ క్రైస్తవ పేద పాస్టర్లకు గౌరవ వేతనం అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పాస్టర్లు జి.విక్టర్, జె.ఫెలోయన్, ఎం ఆమోస్, టి.రవి, పి.జోసెఫ్, కె.పాల్, షాలేంరాజు, సువర్ణరాజు, హరిబాబు, డి.యోహాను, కేఎల్ సుందరరాజు తదితరులు ఉన్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం

ఏలూరు (టూటౌన్): ఏలూరులో బుధవారం నిర్వహించే మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు పిలుపు నిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్‌లో నిర్వహించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీ సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. కరోనా సమయంలో ఏలూరు ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని ఎనలేని సేవలందించారని, ఏలూరు అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారని పెరికె గుర్తు చేశారు. ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కాలేజ్ తీసుకొచ్చారని, వచ్చే ఎన్నికల్లో ఆళ్ల నాని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పెరికె పిలుపు నిచ్చారు.